సీరియల్ కథ

# చీకటి వెలుగులు

రచన:
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంభ.

కళ్ళు పొడుచుకున్నా కానరాని అమావాస్య కటిక చీకటిలో గాఢాంధకార బంధురమైన ఆ కాళరాత్రి సమయంలో నిర్మానుష్యంగావుందావీధి. అక్కడక్కడ కుక్కల మొరుగులు, కీచురాళ్ళ రొద తప్పించి అంతా నిశ్శబ్దమయం-రక్తాన్ని చెమటగా మార్చి శ్రమించి, రాళ్ళను పువ్వుల్లామోసి, అబ్బాయి బువ్వకోసం బాధ పడ్తూ, ఆత్మహత్య చేసుకోడానికి మనసొప్పక కన్నీళ్ళతోనే మండిన గుండెలార్చుకొంటూ బాబును నిద్రపుచ్చే సమయమది. జీవితంలో కష్టాలను, బ్రతుకులో భారాన్ని మరిచి, ఆదమరచిపోవడానికే అబ్బాయిని ఉయ్యాల్లో ఊపుతోంది అభాగిని-తాను తినకపోయినా బిడ్డకు కడుపారా బువ్వపెట్టి, యెండిన రొమ్ములోని రక్తాన్నికూడా పీల్చి నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నాడో బాలుడు,

ఆ పూరింటికి కొంచెందూరంలోనే ఎత్తయిన మేడలో మెత్తని పాన్పుమీద పరుండి రేడియో సంగీతం వింటున్నాడు ముకుందరావు-ఆ ఆనందగీతానికి తోడుగా ఓ అభాగిని జోలపాట పాడ్తోంది. కాని నిజానికది జోలపాటకాదు: బిడ్డని లాలించి ఉయ్యాల ఊపే లాలిపాట కాదు; హృదయాన్ని కదిలించేబాధ-రాళ్ళను సహితం కరిగించేగాధ-ఒక అభాగిని ఆక్రందన-ఎవ్వరూ విని సహించలేని వేదన-ఎంతటి బాధనైనా వోర్చుకునే సహనశక్తి భారతస్త్రీకి ఉగ్గుపాలతోపెట్టిన విద్య. ఆ ఉయ్యాల ఊపుతూన్న అభాగినే శ్యామల-ఆమె ఏకైక పుత్రుడే బాబు-ఆమె భర్త ముకుందరావే పరస్త్రీతో పరమానందంగా పూలపాన్పుపై ఆనందిస్తున్నాడు.

అందరిలాగే శ్యామలకూడా తీయతీయని కలలు కంటూ ఆదర్శగృహిణిగా జీవించాలని ఆశించింది. తన భర్త ఉన్నతోద్యోగి అవ్వాలనీ, తనూతన భర్త జట్టాపట్టా లేసుకు షైర్లుకి, సినీమాలకి, పార్కులకి వెళ్ళాలనీ, క్షణమైనా విడువలేని అన్యోన్యానురాగంతో తమ దాంపత్యం వర్ధిల్లాలనీ, ఎన్నో—ఎన్నో—కలలుకంది ఆమె-కాని తన కలలన్నీ కలలుగానే కరిగిపోయాయి.

తన పెళ్ళికి చేసిన వేడుకల్లో, వినోదాల్లో భోగమేళం మొట్టమొదటగా ముకుందరావుని ఆకర్షించింది. ఆ ఆకర్షణఫలితమే అతడు వేశ్యాలోలుడయ్యాడు. అంతటితో ఆగక తాగుడుకు లోనయ్యాడు. పగలు కొన్ని గంటల కాలం షాపులో పనిచేస్తూడడం; చీకటిపడేసరికి సాని ఇంటి కెడ్తూండడం; ఇదే అతని దినచర్య. తనభర్త త్రాగుబోతు, తిరుగుబోతు అని తెల్సుకోడానికి ఎంతో కాలం పట్టలేదు శ్యామలకి. వివాహమైన ఆరుమాసాల్లో ముకుందరావు పరిస్థితినంతా అర్థంచేసుకుంది ఆమె. కాని దాంపత్య అనుభంధానికి ప్రతిఫలంగా తన కడుపులో ఒక పాప పెరుగుతోందని గుర్తించుకొన్న ఆమె తన దు:ఖాలు ఒక దరికి జేరగలవని ఆనందించింది. తను గర్భిణీతోవున్నానని తెల్సుకొన్నాకఅయినాతన భర్తలో పరివర్తన కల్గుతుందనీ ఆశించింది. కాని శ్యామలకోరిక ఫలించనేలేదు.

శ్యామల గర్భఫలం ఫలించి మగపిల్లవాడు పుట్టాడు. కొడుకు పుట్టిన తర్వాతకూడా ముకుందరావులో ఏమీ మార్పురాలేదు.

చేతిలో పైకంలేని రోజుల్లో తప్పత్రాగి రాత్రికి ఇంటికివచ్చి కొట్టేసిన పాములా పడుండేవాడు. అతను వచ్చేసరికి ఎంతరాత్రయినా ఆమె మేలుకొనేవుండి అతనికి కడుపారా భోజనం పెట్టేది. అతడు తిట్టే తిట్లను, బూతుల్ని భూమాతలాసహిస్తూ, తననికానట్లే ఓర్పుతో వినేది. అతను పెట్టే బాధలన్నీ సహించి అతనికి ఉపచారాలుచేసి, అలసిపోయి ఎప్పుడో అతని పాదాల దగ్గరే నిద్రించేది. ఈ విధంగానే ఆమె ప్రసవించేవరకూ అతనికి శుశ్రూష చేసేది.

శ్యామల ప్రసవించేముందు ఓనాటి అర్ధరాత్రి సమయాన ముకుందరావు ఇంట్లోసామానంతాతీసుకు ఆమెను వంటరిగా వదిలేసి వేశ్యతోసహా మకాం ఎత్తేశాడు.

కనిపెంచిన కన్నవారూ, ఆదుకోవల్సిన అత్తవారూ లేని నిరాధారజీవి శ్యామల. ఇరుగు పొరుగువారి సహా

యంతో ఒక పూరింట్లో నివాసంవుంది. ఒకసుహూర్తాన పుత్రోదయమైంది. ఎంత ఆదరాభిమానములతో చూచే వారైనా పొరుగువారుమాత్రం ఎంతకాలం తల్లీ బిడ్డల్ని పోషించగలరు? బ్రతుకు తెరువుకోసం కూలిపనికిపోతూండేది. పగలంతా కష్టించి పనిచేసి సాయంత్రానికి ఇల్లు చేరి తన బాబుని చూచి మురిసిపోయేది - పోలికలో ముమ్మూర్తులా తండ్రినేపోలిన తన బాబునిచూసి తండ్రి వంటి నీచపుబ్రతుకుమాత్రం తన బిడ్డకు రాకుండా చెయ్యమని భగవంతుని ప్రార్థించేది ఆమె.

రోజూ రాత్రుళ్ళు తనబాబుని ప్రక్కలో పడుకోబెట్టుకు ఆనందంతో పొంగిపోయేది. అంతంలేని ఆవేదన, భరించరాని భాధలు, కడుపారా తిండికికూడా కరువైన తన బ్రతుకులోని కరువు, తనకింక దూరమౌతుందని; అమాయికమైన కళ్ళతో ఆనందజ్యోతిలా వెలగే బాబు ముఖం చూచాక తన భర్తలో తప్పక పరివర్తన కల్గుతావనీ, తన బిడ్డనీ ఆదరిస్తాడని, తన ఆశలు, ఆశయాలు నెరవేరి కోరికలన్నీ కొనసాగే మంచిరోజులొస్తాయని ఎంతో మురిసిపోయేదిఆమె. పెండ్లిఅయిన కొత్తలో గడిపిన కొద్దిరోజులూ ఆమె స్మృతిపథంలో ఎప్పుడూ మెరుస్తూ కన్పరచేవి ఆమెకి-మళ్ళీ ఆ రోజులు వస్తాయని రాత్రింబగళ్లు ఎదురు చూస్తూండేది.

బాబు పుట్టిన ఆరునెలలకి ఓ రోజు హఠాత్తుగా ముకుందరావు స్వరం పోగొట్టుకొని ఇంటికి వచ్చాడు. నిర్ధనుడైనందుకు తన దుస్థితికి విచారించవల్సినదానికి బదులుగా భార్యాని హింసపెట్టేవాడు ముకుందరావు. ఒకప్పుడు శ్రీమంతుడై వ్యాపారధర్మాల్ని బాగా తెల్సిన వాడు కాబట్టి లారీలమీద కొబ్బరికాయ ఎగుమతీచెయ్యడంలోనూ, కొబ్బరికురిడీ, గటగటా, గండేరా, కటిక్కాయ, నీటికాయ, కొబ్బరిలోని అన్నిరకాల న్యాణతలు చూస్తూండడానికై ఓ కొట్లో ప్రవేశించాడు. ఆ డబ్బు ఆసరా చూచుకొని మళ్ళీ మేడలూ ? వేశ్యతో బంధుత్వం కల్పుకొన్నాడు. ముకుందరావు.

ముకుందరావు కొడుకుని కళ్ళారాచూచి, చేతులార ఏనాడూ ఎత్తుకోలేదు. ఇదివరకైతే నోరుపారేసుకునే వాడేకాని ఇప్పుడుమాత్రం చెయ్యిచేసుకోవడం ప్రారంభించాడు. స్త్రీ జాతికి 'సహనమే' పెట్టని ఆభరణం. అందులోనూ పశితనంలోనే తల్లితండ్రులు కరువైన కష్టాల్లోనే పెరిగింది. ఎన్నికష్టాలు భరించినా వుత్తమ లక్ష్యాలూ, ఉన్నతాశయాలువున్న శ్యామల ఎదురుతిరిగి భర్తకు ఏనాడూ జవాబివ్వలేదు. తనలో తనే కుమిలి కుమిలి ఏడ్చేది. తన భర్తకు త్రాగుడు అలవాటుచేసిన వేశ్యలదా ఆ నేరం? తనభర్తదా? తన భర్తస్థితికి ఆతని మనోదౌర్బల్యానికి, ఆతని దుష్టసాంగత్యానికి జాలి పడేది. తనభర్త సత్ప్రవర్తనగలవాడయ్యేటట్లు చెయ్యమని దైవాన్ని ప్రార్థించేది. అన్యాయం, అవనీతి, స్వార్థం పెరిగిపోయిన ఈ సంఘంలో క్రొత్తగా అడుగుపెట్టబోయే తన ఏడాది కొడుకునీ చూచుకుంటూ, భర్త భవిష్యత్‌ను తలపోస్తూ గుండెలు పగిలేటట్లు ఏడ్చేది.

తనభర్త తనని కొట్టి తిట్టి హింసిస్తున్నాడని ఏనాడూ బాధపడలేదా యిల్లాలు - మహా ఘోరమైన త్రాగుడుకి అలవాటైన తన భర్త ఏమౌతాడో; దుస్సాంగత్య ఫలితంగా ఆతనిలోని వ్యాధులు చివరికి అతనినే పరిస్థితికి తీసుకుపోతాయో, అనిపించేది ఆమె. ఆ బాధతోనే మానసిక వేదనతో ఆమె చిక్కి శల్యమైపోయింది. ఆమెలోని సౌందర్యం, యౌవనం నామ రూపాలు లేకుండా అడుగంటాయి. తననుగురించి తను బ్రతకక్కపోయినా ఫరవాలేదనే నిర్లక్ష్యంతో తన్ను తాను నాశనం చేసుకొన్నా, ఉజ్వల భవిష్యత్తున్న తన బాబు మాత్రం అభివృద్ధికి రావాలని ఆశించేది.

ఒకనాడు బాబుకు కొంచెం జ్వరం వస్తే ఆ వీధినే వున్న రామయ్యగారనే వైద్యుని దగ్గరకు వెళ్ళి మాత్రలు తెచ్చి వేసింది శ్యామల. వారం రోజులు బాబుకు జ్వరంతో వుంటే ఒక్క నాడయినా ముకుందరావు గుమ్మంలోకి రాలేదు. శ్యామల వంటరి తనాన్ని గుర్తించిన రామయ్య మాత్రం ముందుకు లోటు చేయచుండా శక్తివంచన లేకుండా వైద్యం చేస్తున్నాడు. రామయ్య కూతురు అనసూయ కూడా రాత్రింబగళ్ళు శ్యామలకు సహాయం ఉంటోంది.

నెల రోజులైనా బాబుకు వచ్చిన జ్వరం తిరుగుముఖం పట్టడం లేదు. మధ్యమధ్య 'నాన్న' అని కలవరిస్తున్నాడు. బాబు 'నాన్న' అని పిలుస్తూంటే ఆ పిలుపు శ్యామలకి గుండెల్లో గునపంతో పొడిచినట్లుగా వుంది. రామయ్య-అనసూయ మాత్రం ఏం చెయ్యగలరు?

ఆ రాత్రి కాళరాత్రి-భయంకరరాత్రి మరుపురాని రాత్రి-ఆ పూరింట్లో గుడ్డిగా వెలుగుతూందొక బుడ్డి దీపం. నులకమంచంమీద బాబుని ఒళ్ళో పెట్టుకు కూర్చుందిశ్యామల. అనసూయకికూడా లోకానుభవం అంటే ఏమిటో తెలియక పోయినా, ఇంకా భర్త, కాపురం, వివాహం అంటేకూడా అర్థం చేసుకోలేని అమాయకురాలైనా; శ్యామల స్థితిని గుర్తించాక జీవితాంత కన్యాత్వంలోనే గడుపుదామనేటంతట విరక్తిలోకి వచ్చింది. ముకుందరావుని మనస్సులో శతసహస్ర శాపనార్థాలు పెట్టుకొంటూ, శ్యామల స్థితికి విచారపడ్తూ, బాబు ఎల్లా వుంటాడో అని ఆదుర్దాతో ఆమెకు సహాయంగా కూర్చుంది అనసూయ.

పెద్ద డాక్టరును తీసుకొస్తేకాని బాబు బ్రతకడని రామయ్యకు తెల్సు-అయినా తనేం చెయ్యగలడు? తను ఏవో ఆయుర్వేద మందులు తెచ్చుకొని చిన్నచిన్న జబ్బులకు వాడుతూ, దానివల్ల వచ్చేడబ్బుతోనే తనూ తన కూతురు అనసూయ జీవయాత్ర చేస్తున్నారు. అనసూయకు ఇరవై ఏళ్ళు వచ్చినా, తను బీదవాడు కావడం చేతనే ఆమెకు పెళ్ళికూడా చెయ్యలేకపోతున్నాడు. ఓ పూట వుంటే రెండోపూట భత్యానికి తడుముళ్ళాడే స్థితి రామయ్యది, తను చెప్పినాకాని పెద్ద డాక్టరు రాడు. ఫీజు ఇవ్వందే పిలిస్తేకూడా పలకడు. ఇంక ఏమీ చెయ్యలేక బాబు ముఖంలోకి చూస్తూ కూర్చున్నారు ముగ్గురూ.

'నాన్న' అని కలవరించాడు బాబు. కళ్లు విప్పి చూచి అమ్మా నాన్న అంటూ మళ్ళీ కళ్లు మూశాడు. శ్యామలకీ ఎటూ పాలు పోవడం లేదు. క్షణ క్షణానికి జ్వర తీవ్రత హెచ్చిపోయి బాబు నాన్న! నాన్న!! అని తెగ కలవరించేస్తున్నాడు. శ్యామల భర్తను తీసుకురావాలని రామయ్య వెళ్ళాడు. కాని గుమ్మందగ్గర నుంచే అతన్ని సాగనంపాడు. చివరకు అనసూయ కూడా సాహసించి వెళ్ళింది శ్యామల దుఃఖం చూడలేక. ఆమెను గేటుదాటి లోపలికి రానివ్వనేలేదు. రామయ్య అనసూయ కల్సి వెళ్ళి పెద్ద డాక్టరును కూడా వేడుకొన్నారు. అధమం అయిదు రూపాయలైనా ఇస్తేకాని చూడ్డానికే రానని భీష్మించుకు కూర్చున్నాడు డాక్టరు. చిట్టచివరకు శ్యామలకు చెప్పాడు రామయ్య.

శ్యామల దృష్టితో తన కొడుకును బ్రతికించ గలవాడొక్క డాక్టరు మాత్రమే. తన బాబును కాపాడే దేవతామూర్తి డాక్టరే. ఆ డాక్టరుకి అయిదు రూపాయలివ్వాలి. అవి తనకి యెలా వస్తాయి? తన మెడలోని పవిత్ర మాంగళ్యాలు కూడా భర్త బలాత్కారంగా తీసుకుపోయి త్రాగుడికి ఆహుతి చేశాడు. ఇంక తనేం చెయ్యాలి? వెళ్ళి డాక్టరు కాళ్ళమీదే పడి వేడుకొందామని తనే వెళ్ళి డాక్టరుగారి తలుపులు తనశక్తికొద్దీ బడబడా కొట్టి నోరునొప్పి పెట్టేవరకూ అరిచింది. కాని ఇల్లాంటి అణాకానుల పిలుపుకి ఆ ప్రయివేటు డాక్టరు తిరిగి జవాబైనా ఇవ్వలేదు. చివరికి విసుగెత్తి తన బాబు దగ్గరికి వచ్చింది శ్యామల.

బాబు పరిస్థితి బాగా సృతి మించి పోతోంది. విపరీతంగా మూల్గుతున్నాడు. ఆ మూల్గులోనే 'నాన్నా' అని అంటున్నాడు అస్పష్టంగా.

'అక్కయ్యగారూ! ముకుందరావుగారు వస్తే ఎల్లాగయినా డాక్టరున్ని తీసుకురాగలరు. ఈ ఆఖరు సమయంలో బాబుని-' ఇంక చెప్పలేక పోయింది అనసూయ.

'ముకుందరావుగారి దగ్గర ఎంతటివాళ్ళనయినా వశపర్చుకొనే సామర్థ్యం వుంది. ఆయన వస్తే బాబు జీవించవచ్చు' అన్నాడు రామయ్య.

ఇంక బాబు విషయంలో వారిద్దరూ అల్లా చెప్పేసరికి శ్యామల మనస్సు తల్లడిల్లి పోయింది. అరిచింది. ఏడ్చింది-అందరు దేవుళ్ళను ప్రార్థించింది-భర్త!... ఆమెకున్న ఆశా కిరణం అదొక్కటే-ఆశ యింక అదొక్కటే...ఆ చీకట్లో చిన్న ఆశాకిరణం...అదే తనకందుబాటులో లేని ఆ పెద్ద మేడలో పై అంతస్తుమీద తనభర్త ఆ రాణీ అనందబాహువుల్లో హాయిగా నిదురిస్తూంటాడు...ఒక్కసారి బాబు ముఖంలోకి చూచింది. నా...న్న...అని ఒణికే పెదవుల్తో అస్పష్టంగా అంటున్నాడు బాబు.

'బాబూ! మీ నాన్నని తీసుకువస్తా! నిన్ను బ్రతికించుకొంటా!! నాయనా!!!' అంటూ అరిచింది. ఇంక ఆతల్లి వెనకా ముందూ ఆలోచించలేదు-ఆమె మాతృప్రేమకి కటికి చీకటి కూడా అడ్డు రాలేదు. విడిపోయిన జుట్టు

కూడా ముడివేసుకోవాలన్నా గుర్తు కూడా ఆమెకు లేదు.

ఒక్క పరుగున ఆ పెద్దమేడ దగ్గరకు వచ్చింది. ముందు గేటుకు పెద్దతాళం వేసివుంగి. అయినా ఆ తలుపులు తాళం కూడా పశివాడి ప్రాణం కోసం పోరాడే ఆ బీద అమాయకురాలి మాతృప్రేమకు అడ్డం రాలేకపోయాయి. ఎంతమాత్రం సంకోచించకుండా ఒక్క లిప్తలో ఆ ఇనప ఊచలు పట్టుకు గేటుపైకి ఎక్కి లోపకి లిఉరికేసింది. వీధి గుమ్మం తలుపు గబగబా బాదుతోంటే అక్కడే చాపలో పడి గురకపట్టి నిద్రపోతోన్న నౌకరు లేచి 'ఎవరు వారు?' అన్నాడు.

'వీధి తలుపు తీయించు. ముకుందరావుగారు కావాలి' అంది శ్యామల.

'ఇప్పుడేంటమ్మా! అర్ధరాత్రి వేళ — నిద్దర్లో వున్నారు' అన్నాడు ఆతడు.

'వారి అబ్బాయి చాలా జబ్బుగా వున్నాడు. త్వరగా వారిని తీసుకెళ్ళాలి.' అంది ఆతృతగా.

'ఏమో! ఆ గొడవేంటో నాకేం అక్కర్లేదు. పొద్దున్నగాని ఆరులెగరు. ఎల్లండి' అన్నాడు చిరాకుగా.

'మా బాబుకి చాలా జబ్బుగావుంది. అయనకోసం కలవరిస్తున్నాడు. నేను ముకుందరావుగారి భార్యను, ఒక్కసారిలేపు నాయనా!' దీనాతి దీనంగా వేడుకుంది ఆమె.

'అసలు అద్దరేతిరికాడ లేపితేనే అమ్మగోరూరు కోరు. అందులోనూ ఇక్కడికొచ్చే వోళ్ళ పెళ్ళాలంటే ఇంకేమన్నా వుందా? అగ్గయిపోతారు నామీద. నాకూట్లో దుమ్ముకొట్టుకోలేను అమ్మగారూ! పొద్దున్నే రండి.' అని చెప్పాడు.

'సరే! అల్లాగైతే నేనే లేపుతాలే' అంటూ తల్పు గబగబ గుద్దడం ప్రారంభించింది శ్యామల.

'అయ్యో బాబయ్యొబాబో! ఆరూరుకోరండి. నన్ను సంపేతారమ్మగోరో! అసలు గేటుతలుపే తియ్యనివ్వరు. మీరెల్లాగొచ్చారో యేంటో!' అంటూ తల్పుతట్టుతూన్న ఆమెను వారించబోయాడు.

'ఏయ్! దూరంగా వుండు'' అంటూ గర్జించింది ఆమె.

తన యావశ్శక్తినీ వినియోగించి తలుపులు బ్రద్దలయ్యేటట్లుగా చాలాసేపు బాదిన తర్వాత 'ఎవరు వారు?' అంటూ ఓ ముసలమ్మ వచ్చి తల్పుతీసింది.

'ముకుందరావుగారు ఎక్కడున్నారు?' ఆతృతగా అడిగింది.

'మీరెవరు? ఎందుకోసం వచ్చారు? ముకుందరావుగారితో మీకేంపని?' అంటూ లాయరులా ప్రశ్నలు అడిగింది ఆ వృద్ధురాలు.

'ముకుందరావుగారి భార్యని. మా బాబుకి జబ్బుగా వుంది. త్వరగా రావాలి.' అంది గాభరాగా.


ఇందుకా అర్థరాత్రివేళ వచ్చావు? ఇంకేం వంక దొరక్క కొడుక్కి రోగం అని ఆయన్ని తీసుకుపోవడానికా? చాలు చాల్లే! సంసారివికావూ?...అంటూ సణుగుడు ప్రారంభించింది ఆ వేశ్యమాత,

'ముందాయన ఎక్కడున్నారో చెప్పు?' గట్టిగా అడిగింది.

'చెప్పకపోతే ఏంచేస్తావేమిటి నన్ను? ఈ అర్థరాత్రివేళ అరవబోకు తిన్నగా వచ్చినత్రోవనే మంచిగా వెళ్ళు. కావాలంటే రేప్రొద్దున్నేవచ్చి నీ మొగుణ్ణి నువ్వు తీసుకువెళ్ళొచ్చు.' అంటూ సాగదీసుకొంటూ అభినయంతో సహా చెప్పింది వేశ్యమాత.

'ఇప్పుడు వారిని తీసుకు వెళ్ళకుండా నేనిక్కడ నుంచి కదలను. చెప్తావా? చెప్పవా?' అని గర్జించి అడిగింది.

(సశేషం)



సీరియల్ కథ

# చీకటి వెలుగులు

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంభ.

(గత సంచిక తరువాయి)

'ఇదుగో అమ్మాయ్! మర్యాదగా చెప్తున్నాను వెళ్ళిపో! ఇది మంచి నిశి రాత్రి వేళ, హాయిగా మేడ మీద నిద్దరోతున్నారు. ఈ రాత్రి నీ మొగుడెక్కడికీ పారిపోడులే - వెళ్ళు! వెళ్ళు!!' అంటూ చీదరించుకొంటూ చెప్పింది.

'తప్పుకో - మేడమీదికి వెళ్ళి లేపుతాను' అని తీవ్రంగా అంది.

'వీల్లేదు - నువ్వు గడపదాటి లోపలకు రావడానికి వీల్లేదు. మనిషికి ఓసారి చెబితే చాలదూ!' కోపంగా అంది వేశ్య మాత.

'మనిషి కిశాబట్టె కన్న కొడుకు ప్రాణం మీదికివస్తే కట్టుకున్న భర్తకోసం నీ యింటికి వచ్చాను వారిని పంపించు' అంది ప్రాధేయతగా.

'ఇప్పుడు మాత్రం అమ్మాయికి నిద్రాభంగం చెయ్యడానికి వీల్లేదు. ప్రొద్దున్నే లేపి పంపుతానులే' నక్కవినయంతో చెప్పింది.

'నా బాబుకంటె నీ కూతురి నిద్ర చెడిపోతే మరేం ప్రమాదం లేదు' అంటూ గుమ్మానికి అడ్డంగా నిల్చున్న ముసలి వేశ్య మాతను ఒక్క గెంటుతో ప్రక్కకు నెట్టి రివ్వున యింట్లోకి జొరబడింది. నాలుగు వైపులా వెదికి మేడ మెట్లున్న గదిలోకి వెళ్ళి గబగబా మేడ ఎక్కేసింది. తిన్నగా పడక గది తలుపులు ధడీధడీ బ్రద్దలు కొట్టేటట్లు కొట్టింది. 'ఎవరు?' అంటూ రాణీ లేచి వచ్చి తలుపు తీసింది.

ఎదురుగా మంచంమీద ముకుందరావు హాయిగా గుండెలమీద చెయ్యి వేసుకు పడుకున్నాడు. అర్థరాత్రి వేళ పిడుగులు పడ్డట్టుగా తల్పుపు గుద్దిన చప్పుడికి, ప్రక్కనున్న రాణీ లేవడంచేత కొంచెం కళ్ళు విప్పి గుమ్మం వైపు చూస్తున్నాడు. ఎదురుగా భర్త కన్పించేసరికి శ్యామలకి ఒక్కసారిగా దుఃఖం పొంగి పొర్లి వచ్చింది. కాని ఆ సమయంలో ధైర్యం చిక్కబట్టుకొని 'మా అబ్బాయికి చాలా జబ్బుగా ఉంది. వారిని ఓ సారి పంపించండి.' అంది నెమ్మదిగా.

ఈ మాట విని ఉలికిపడి లేచి మంచంమీద కూర్చున్నాడు ముకుందరావు.

'మీరెవరమ్మా! ఎవరికోసం వచ్చారు?' అనడిగింది రాణి.

'నేను ముకుందరావుగారి భార్యనే - మా బాబు చాలా ప్రమాద స్థితిలోనుండి నాన్నకోసం కలవరిస్తున్నాడు. ఒకసారి అర్జంటుగా వారిని పంపించండి - బాబుని చూడాలి.' ఎంతో బాధతో అంది శ్యామల.

అంతలో ఆయాసపడుతూ, రొప్పుకొంటూ, రొజుకొంటూ, ఒగుర్చుకొంటూ అక్కడికొచ్చించి వేశ్య మాత.

'ఏమండీ? మీ అ బ్బయికి జబ్బుగా వుందా?' అంది రాణి.

'ఏమో! నాకు తెలీదు రాణీ! నేనింటికెళ్ళి అప్పుడే నెల కావస్తోంది.' అన్నాడు ముకుందరావు.

'అదంతా ఒట్టి నాటకం. మొగుణ్ని లాక్కుపోవడానికి వేసిన ఎత్తు' అంటూ గుమ్మం దగ్గరగా వచ్చి చెప్పింది వేశ్యమాత.

'నామాట నమ్మండి. బాబుకి జబ్బు చాలా ప్రమాద స్థితిలో ఉంది! డబ్బులేకుండా డాక్టరుగారు రానన్నారట. రామయ్యగారినీ, అనసూయనీ బాబుదగ్గరవుంచి మీకోసం వచ్చా త్వరగా రండి.

'అబ్బో! నీలాంటి నంగనాచుల్ని కావల్సినంతమందిని చూశాను. పెళ్ళాం పోయిన రామయ్యా నీయిల్లు పట్టాడుగా! ఇంకా మొగుడెందుకు? ఎంతటి జాణవు కాకపోతే గేటుదాటి, గోడలు దూకి అర్థరాత్రి రాగల ధైర్యశాలివి; నువ్వెంతటి పనికైనా సాహసించగలవు వెళ్ళు - చాల్లే నీ నక్క జిత్తులు!' అంటూ ఎంతో ఈసడింపుగా అంది వేశ్యమాత.

'ఏమండీ! మన బాబుకోసం రారూ?' ఎంతో దుఃఖ భారంతో భర్త ముఖంలోకి దీనంగా చూస్తూ వేడుకుందామె.

'వస్తారు లెండి. మీరు వెళ్ళండి,' అంది నిర్లక్ష్యంగా రాణి.

''మన బాబు నాన్న నాన్న అంటూ కలవరిస్తున్నాడు. త్వరగా రండి. మీ కోసమే వచ్చాను. ఈ ఒక్కసారి నామాట వినండి. మీ కాళ్ళు పట్టుకు వేడుకొంటూ - మన అబ్బాయి...' అంటూ శ్యామల ముకుందరావు రెండు కాళ్లూ పట్టుకొంది.

రాణి కళ్లు, తల్లి కళ్లు కల్సి ఏదో సంజ్ఞాపూర్వకంగా మాట్లాడుకొంటున్నాయి. కన్నతల్లి కడుపు మంటతో తల ఎత్తి చూసే స్థితిలోకూడా ఆమె లేదు-కన్నీళ్ళతో భర్త పాదాలను తడుపుతూ కన్నకొడుకు కోసం రమ్మని ప్రార్థించుకొంటోంది. ఆతని మనసుకూడా ద్రవించి పోతోంది.

''తెల్లవారాక వెళ్ళొచ్చు. త్వరగా ఆమెను పంపించండి. అర్ధరాత్రి వేళ ఏమిటీఘోషం కొంపలో?... ఇదంతా నటనగాని నిజమని మాత్రం నమ్మకండి' అంది రాణి.

ముకుందరావు మనస్సు దేవేస్తోంది. తన యిల్లాలుతో సమానమయిన ఉత్తమరాలు లేదని ఆతని అంతరాత్మకు తెలుసు. ఆమె కలలోకూడా అబద్ధమాడని పరమ పావని అని ఆతని హృదయం ఘోషిస్తోంది. పాదాలమీద భార్య; ప్రక్కని ప్రియురాలు. ఆతని లోని మానవత్వం ఘోష పెడుతోంది. బిడ్డకోసం ముందుకు పోవాలా? ప్రేయసికోసం ఆగిపోవాలా'' కొన్ని క్షణాలు ఆలోచిస్తూ అల్లాగే నిల్చుండిపోయాడు. ఆతనిలోని పితృ ప్రేమ ప్రియురాలి ప్రేమ క్షణకాలం పెనుగులాడాయి. పసివాడి ప్రాణకోసం తహతహతో తల్లి తన పాదాలమీద మోకరించింది. నవ్వించి, కవ్వించి, ఆనంద పర్చే వేశ్య ఆగమంటోంది—తను ఇప్పుడు రాణిమాట కాదని వెళ్ళిపోతే తిరిగి ఈ గుమ్మం త్రొక్కనీయదు. యెముకల పుట్టవంటి భార్యతో తను సుఖించలేడు - చివరకు ఆతనిలోని కామమే జయించింది. స్వార్థం పిరికితనం ఆతనిలో ఆవేశించాయి.

'ఈ అర్ధరాత్రి సమయంలో నేను వచ్చిమాత్రం చెయ్యగలిగిందేముంది? ప్రొద్దున్నే వస్తాను. నువ్వు వెళ్ళిపో!' అని దులపరించుకు తన పాదాలు రెండూ ముందుకు తీసుకు మంచం దగ్గరకు వచ్చాడు ఆతడు.

'చెప్పేరుగా-ఇంత త్వరగా ఇక్కడనుంచి వెళ్ళిపొండి.' అంటూ నిస్సాకారంగా చెప్పి రాణీకూడా మంచం దగ్గర నిల్చుంది.

ఆ మాటతో శ్యామలలోని సహనమంతా నశించింది లేచి నిల్చుంది. 'రాణీ! నువ్వుమాత్రం పిల్లలుగల తల్లివి కావా? కడుపులో కార్చిచ్చుపెట్టడానికి సిద్ధంగా వున్న కన్న కొడుకుని వదలి కట్టుకొన్న భర్తకోసం నీ యింటికి వచ్చి అర్థించి అడుగుతున్నా - ఈ ఒక్క రాత్రికి నా భర్తని పంపించు-రాణీ! నాకూ నా బాబుకీ వీరుతప్ప లోకంలో 'నా' అన్నవాళ్లెవరూ లేరు. సాటి ఆడదాని బాధ కష్టం అర్థంచేసుకు ఒక్కసారి పంపించు. ఇవి నీ చేతులుకావు కాళ్లుగా భావించు-నాబాబుకోసం ...' ఇంక చెప్పలేకపోయింది.

'సంసారివైనా బలే యాక్షన్ నేర్చుకున్నావు? ఇంత బాగా అభినయించడం నేనెక్కడా చూళ్లేదింతవరకూ' అంటూ దర్జాగా అంది రాణి.

'రాణీ! నువ్వు వృత్తికి వేశ్యవయినా మానవత్వం, మాతృత్వం అయినా నీలోవుండి సాటి స్త్రీమీద జాలిపడి నీ ధర్మాన్ని నువ్వు నెరవేర్చి నా భర్తను పంపిస్తావనుకొన్నాను. కాని సానులైనవారి మనస్సులు సానరాళ్లవంటివనుకోలేదు. నీచురాలా! కావాలంటే వచ్చి నా బాబు ఏస్థితిలో వున్నాడో కళ్లతో చూడు. ఈనాడు కండకావరంలో కళ్ళుగప్పి కన్నతండ్రిని బిడ్డనుంచి దూరంచెయ్యకు. నా భర్తని పంపించు-నువ్వు పంపకపోతే నేనే తీసుకువెడ్తా-నేను వారి భార్యని' అంటూ రాణీని ఓ చీడపురుగుని చూచినట్లు చూచి భర్త ముందు నిల్చుంది శ్యామల.

'ఏమే! మాటలు తిన్నగా రానీయ్! అర్ధరాత్రప్పుడు దొంగలా నా యింటికి నిన్నెవరు రమ్మన్నారు? నీకాపాటి శక్తివుంటే నీ భర్తని ఎల్లా తీసుకెడ్తావో నేనూ చూస్తా-నువ్వు కొట్టుకుచచ్చినా ఆయనీ రాత్రికి రారు. ఏంచేస్తావో చెయ్యి!' అంటూ ఆతడి ముఖంలోకి చూచింది రాణి.

భార్య ముఖంలోని దీనత్వం కళ్లల్లోని కన్నీరుకంటే, వెలయాలి ముఖంలోని చిరునవ్వులే అతన్ని బంధించి వేశాయి.

'నేను వస్తానని చెప్తుంటే నీకాక్కాదూ? ఇక్కడి నుంచి వెళ్ళిపో' కఠోరంగా ఆజ్ఞాపించాడు అతడు.

ఆమాటతో ఆమెలో ఆవేశం దుఃఖం ఎక్కువయ్యాయి. 'అదేం మాటండీ? కన్నకొడుకుకంటే ఒక్కరాత్రికి మీ ఆనందం ఎక్కువా? కట్టుకొన్న భార్య, కన్నబిడ్డ అక్కడ దురంత దుఃఖంలో వుంటే ఇక్కడ మీరు వినోదంగా వుంటారా? ముందు బాబు దగ్గరకి రండి-తండ్రిగా వాడిని పల్కరించి బ్రతికించండి' అంటూ రుద్రకాళీస్వరూపందాల్చి అడిగింది ఆమె.

'నేను రాను. ముందు ఇక్కడనుంచి కదుల్తావా? లేదా?' గర్జించాడు అతడు.

'రావాలి! బాబుకోసం మీరు వచ్చితీరాలి!! నా కన్నకొడుకుకంటే నాకేం ఎక్కువలేదు రండి!!!' అంటూ ఉద్రేకంతో భర్తచేతిని గట్టిగా పట్టుకు బరబరా ముందుకు లాక్కొచ్చింది ఆమె. ఆమె భయంకర స్వరూపానికి ఒణికిపోతూ రెండడుగులు ముందుకివేశాడు ముకుందరావు.

'ఆయన్ని తీసుకువెళ్లడానికి వీల్లేదు.' అంటూ అరుస్తూ ఓచెయ్యి రాణి, రెండో చెయ్యి వేశ్యమాత పట్టుకొన్నారు.

'ముందు నాతో రండి' అంటూ అతని చొక్కాను పట్టుకు లాగింది శ్యామల.

'మొగ మహారాజువి; చెప్తూన్నాకాని వినని ఆడది భయభక్తులున్నదేనా? రెండుతన్ని ంటిపారేస్తే కదలక ఏంచేస్తుందంట?' అంటూ ప్రబోధం చేసింది వేశ్యమాత.

కావల్సిన కార్యక్రమాన్ని కళ్లతోనే చెప్పింది రాణి.

దుర్బలుడైన భర్త 'పోతావా? పోవా?' అని రెండు తన్నాడు ఆ మహాసాధ్విని.

'బాబు-మన బాబుకోసం రండి—కన్నకొడుకు—పోనీ అయిదు రూపాయలివ్వండి, బాబును బ్రతికించుకొంటాను' అంటూ క్రిందపడిన ఆమె గోడు గోడున ఏడ్చింది.

ఆ కర్కశ హృదయాల ముందు ఆమె రోదన అరణ్యరోదన అయిపోయి, మేడమెట్లమీంచి క్రిందకి త్రోసి వెయ్యబడింది.

'మీరు మనషులా? రాక్షసులా? కడిపెడు దుఃఖంతో వచ్చిన నన్ను ఇల్లా చేస్తారా?' అంటూ నుదురుమీంచి, చేతులమీదనుంచీ రక్తం కారుతోన్నా లెఖ్ఖచెయ్యకుండా కొడుకుకోసం ప్రాణాన్నికూడా తెగించి పోరాడేందుకై లేచినిల్చుంది ఆ సాధ్వి.

హృదయవిదారకమైన ఆమె ఆక్రందన ఆ మదాంధులు వినకుండా బరబరా గేటుబయటకు ఈడ్చివేసి తాళంవేశారు. భోరున ఏడుస్తూ బాబుకోసం పరుగెత్తుకు వచ్చింది.

బాబు సన్నగా మూల్గుతున్నాడు. ఆమె భీభత్స రూపాన్ని చూచి రామయ్య అనసూయ హడిలిపోయారు.

'నా బాబుని ఇంకెవ్వరూ బ్రతికించలేరా? అంటూ, అరిచింది ఆ తల్లి.

'అమ్మాయీ! కష్టాల్లో వున్నవాళ్ళనే దేవుడు పరీక్షిస్తాడు. ఇంక మనం చెయ్యవల్సిందేమీలేదు. అంతా దైవ నిర్ణయం' అని నిట్టూర్చి చెప్పాడు రామయ్య.

'డాక్టరుగారి కాళ్ళుపట్టుకు తీసుకొస్తే నా బాబు బ్రతుకుతాడేమో!' ఇంకా ఆశ పీడిస్తూంటే అడిగింది శ్యామల.

'అన్ని విధాలా నే నడిగినానమ్మా! ఇంక ఆయన వస్తాడనుకోవద్దు' అన్నాడు బాధగా రామయ్య.

'పోనీ! ముకుందరావుగారు పనిచేసే కొబ్బరి కొట్లో వారిని ఏమైనా డబ్బు ఇమ్మంటే...ఇప్పుడు ఇస్తారా?' కళ్ళంట నీళ్ళతో చెప్పింది అనసూయ.

ఇంకా ముందూ వెనకా ఆలోచించే శక్తినికూడా లేకుండా పిచ్చిదానిలా చేస్తోంది ఆమెలోని మాతృప్రేమ. ఆ ఆరాటంతో ఆ రక్త మయమైన ఆకారంతో ఒళ్ళు తెలీకుండా కొబ్బరి కొట్టు వైపు పరుగెత్తింది ఆ మాతృ మూర్తి - గేటు దగ్గరకెళ్ళి 'బాబూ!' అని పొలికేక పెట్టింది శ్యామల.

భయంకరమైన ఆమె అరుపుకి ఆ దగ్గర్లోనే చల్లగాలికి నిద్రపోతున్న కొట్టు యజమాని కొడుకు శ్రీధరం ఖంగారు పడ్తూ ఎవరు వారు?' అని అడిగాడు.

'బాబూ! నా కొడుకు చాలా జబ్బులో వున్నాడు. ఒక్క అయిదు రూపాయలివ్వండి. రేపు ముకుందరావు గారికిచ్చే సొమ్ములో తీసుకోండి-మా కొడుకుని బ్రతికించుకొంటాం!' అంది హృదయ విదారకమైన రోదన స్వరంతో.

'ఎవరమ్మా? అర్ధ రాత్రివేళ ఆడదానవు ఒంటరిగా వచ్చావు?' అంటూ టార్చి లైటు వేసి చూచి ఆమె అవతారం గమనించేసరికి హడలి పోయాడు ఆతడు.

'బాబూ! పేదరాలిని - నా కన్న కడుపు కాపాడండి. ఒక్క అయిదు రూపాయలివ్వండి డాక్టరుకిచ్చి నా బిడ్డని బ్రతికించుకొంటా. వా బాబే నాకు ఆధారం! అంటూ ఏడుస్తూ చెప్పింది,

'అమ్మా! నడవండి. నేనూ వస్తా,' అంటూ ఆతడు టార్చి లైటు వేసి దారి చూపిస్తున్నాడు. వెనుక ఆతడు వస్తోంటే ముందామె పరుగెత్తుతోంది.

గబగబా ఆదుర్దాగా తలుపులు బాది 'డాక్టరుగారూ!' అంటూ అరుస్తోంది ఆమె. అంతలో శ్రీధరం వచ్చి 'మీరు ఆగండమ్మా! నే పిలుస్తాను' అని 'మిస్టర్ డాక్టర్! నేను శ్రీధరాన్ని; సీరియస్ కేస్; అర్జంటూ అన్నాడు తలుపు దగ్గర.

ఆ పిలుపుకి క్షణంలో తలుపు తెరుచుకొంది. 'త్వరగా రండి. చాలా ప్రమాదదశలో ఉన్న కుర్రవాడుట' అని పది రూపాయల కాగితం చేతులో పెట్టేసరికి వెంటనే బయలుదేరాడు వైద్య నారాయణుడు.

బాబుని చూచి పెదవి విరిచాడు.

'డాక్టరుగారూ! నా బాబుని బ్రతికించండి. నా చిట్టి తండ్రి బ్రతుకు మీ చేతిలో వుంది' అందామె ఏడుస్తూ.

'డాక్టర్! ఆ కుర్రవానికి చెయ్యవలసినంత వైద్యం చెయ్యండి. డబ్బు నేనిస్తా - ఇక్కడే ఉండండి, అన్నాడు ఆతృతగా శ్రీధరం.

డాక్టర్ శ్రీధరం కూడా అల్లాగే రెండు గంటల సేపు బాబుకోసం ఎంతో శ్రమపడ్డారు. కాని ఇంకా' గంట రాత్రి ఉండగానే డాక్టర్, బాబు ముఖంమీద గుడ్డ కప్పేసరికి ఘొల్లుమంది గర్భశోకంతో ఆ మాతృమూర్తి.

* * *

'అమ్మాయీ! శ్యామలా! శ్రీధరంగారు చెప్పినట్లుగా చెయ్యడమే మంచిదమ్మా! ఆతని మనస్సులోని చీకటిని పోగొట్టి యెప్పటికయినా మీ సంసారంలోకి వెలుగు వచ్చేలా చూడకపోతే ఎల్లాగమ్మా నీకు తండ్రీ వంటివాణ్ని - ఎందుకు చెప్తున్నానో వినమ్మా! అంటూ ఏంతో దూరం చెప్పినతర్వాత చిట్టచివరకు గత్యంతరం లేక అంగీకరించింది శ్యామల.

ముకుందరావు కొట్లో జీతం పుచ్చుకు జేబులో పెట్టుకుని హుషారుగా, ఉల్లాసంగా పాట పాడుకొంటూ నడుస్తున్నాడు. కొట్టుదాటి వీధి మలుపు తిరిగే సమయంలో వెనకనుంచి ఆతని ముఖంపై ఎవరో తువ్వాలు పడేసి రివ్వున జేబులో పర్సు తీసుకు సైకిలుమీద వెళ్ళిపోయారు. పాపం! మనిషిని గుర్తించలేక సైకిలు వెళ్ళినవైపు పరుగెత్తాడు. కాని మనిషి పత్తాయే లేదు. కొట్టు గుమ్మందగ్గర సైకిలు దిగుతూన్న శ్రీధరాన్ని చూచి 'ఏమండీ! ఇటువైపు ఇప్పుడే ఎవరైనా సైకిలుమీద వెళ్ళడం చూశారా' అనడిగాడు ముకుందరావు.

'తెలీదండి. నేను అల్లా వెళ్లాలని ఇప్పుడే బయటికి వస్తున్నా' అన్నాడు శ్రీధరం.

తన పర్సు కొట్టేసినవానికోసం ఓగంట నానా తంటాలుపడి చివరకు నిరాశతో రాణీ ఇంటికి వచ్చాడు.

డబ్బుకోసం ఎదురుచూస్తూన్న రాణి, ఆమె తల్లి కూడా ఖాళీ జేబుతో వచ్చిన ముకుందరావుని ఈసడించారు. వచ్చే నెలకు ఇవ్వబోయే జీతమైనా అడిగి తెస్తానని కొట్టుదగ్గరకు వచ్చాడు ముకుందరావు.

కొట్టు యజమాని, ఆతని కొడుకు శ్రీధరంకూడా తమకింక గుమస్తా అక్కర్లేదని ముకుందరావు ఉద్యోగానికి వీడ్కోలిచ్చి సాగనంపారు—వారం రోజులు ఆతడు ఎక్కడికి నౌకరీకోసం వెడితే అక్కడే శ్రీధరం కన్పిస్తూండడం; తనకి ఎక్కడా పని దొరక్కపోవడంతో రాణీ దగ్గరకువచ్చి తన కష్టాన్నంతా చెప్పుకొన్నాడు.

'డబ్బు లేకుండా నిన్ను కూర్చోబెట్టుకు మేపడానికి నేనేమీ కట్టుకున్న పెళ్ళాన్ని కాదు. ఛో! పొమ్మని ఆనాడు తన భార్యకి జరిగిన పరాభవమే తనకీచేసి గేటు బయటికి సాగనంపారు ముకుందరావుని.

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

ఆనాడు రాత్రి తన భార్యవచ్చి వెళ్ళాక ఈ పక్షం రోజులూకూడా బాబు ఏమయ్యాడో అతనికి గుర్తే రాలేదు. కాని ఈనాడుమాత్రం ఇల్లాలు, ఆమె కార్చిన కన్నీరు, తను పెట్టిన బాధలు కళ్లముందు కన్పిస్తూంటే పూరింటికి పరుగెత్తాడు. లోపలికి వెళ్లేసరికి శ్యామల వంట చేస్తోంది-బాబును తల్చుకొని ఆదంపతు లిద్దరూ భోరున ఏడ్చారు.

వారంరోజులున్నా కాని అతనిలో భార్యపై నిజమైన అనురాగం ప్రేమ కలగకపోగా ఎప్పటికైనా తను మళ్లీ ఇంకో...అపమార్గానికే పోవాలనుకొంటూ నౌకరీ వెతుక్కోడానికి బయటకు పోయాడు ముకుందరావు.

సాయంత్రం ముకుందరావు ఇంటికి వచ్చేసరికి శ్యామల, మరో అందమైన ఇరవైఏళ్ల యువకుడు చాపలో కూర్చుని కబుర్లు చెప్పుకొంటున్నారు-లోపలికి వచ్చి చూచి అల్లాగే నిర్ఘాంతపోయి నిల్చుండిపోయాడు ముకుందరావు.

కృత్రిమ అలంకారాలేమీ లేని సహజ సౌందర్యంతో చిక్కిపోయి బక్కపలుచగావున్నా ఎంతో అందంగా వుంది శ్యామల ముఖం. తలనిండా మల్లెపూలు-తెల్లని చీర నల్లని జాకట్టు ఆమె పచ్చటి శరీరానికి ఎంతో అందంగా వున్నాయి. మెళ్లో నల్లపూసలు, పసుపు కొమ్ము కట్టుకొన్న బొందు, చేతికి గాజువి గాజులు తప్పించి ఇంకేమీ లేకపోయినా, ఎంతో అందంతో ఆనందంతో వెలిగిపోతోన్నట్లుగా వుంది. ఇన్నాళ్లూ ఆమె తనసొత్తేనన్న ధీమాతో, బానిసగా పడుండాలనే భావంతో వుండే ముకుందరావుకి ఆమెలోని అందం చూడాల్సిన అవసరం కన్పించలేదు-కాని ఈనాడు ఆమె ప్రక్కన మరో యువకుడు వుండడంతో తనభార్యలోని అందాన్ని స్పష్టంగా చూడగల్గేడు. ఆమెవల్ల ఆ పరాయి వ్యక్తి ఎంతటి ఆనందాన్ని పొందగలడో ఊహించుకో సాగాడు. మళ్లీ అంతలో ఇంకో ఆలోచన-ఇన్నాళ్లూ తన భార్య అందమైనదీ; బలమైనదీ కాదనీ, తనని ఆకర్షించే యవ్వనం ఆమెలో లేదనేకదా తను అపమార్గాలు పట్టాడు?...మళ్లీ ఆ యువకునివైపు శ్యామలవైపు తీవ్రంగా చూచాడు. కాని తను వచ్చినట్లుకూడా వారిద్దరూ గుర్తించకుండా ఆనందంతో మైమరచిపోయి కిలకిలా నవ్వుకొంటున్నారు. తన భార్యలోకూడా ఎంతో ఆకర్షణ, యవ్వనం, సరదాలు వున్నాయి-కాని తనే ఇన్నాళ్లూ గుర్తించుకోలేకపోయాడు. అయితే ఈ పరాయి వ్యక్తి ఎన్నాళ్ళనుంచి తన భార్యతో...ఇంక ఆలోచించుకోలేకపోయాడు. అసూయా జ్వాలలు చుట్టుముట్టాయి. కోపంతో కంపించిపోయాడు. పట్టశఖం కాని అహంకారంతో 'ఏయ్? ఈతడెవరు?' అని గర్జించాడు.

'నాకు తెల్సిన స్నేహితుడు రండి. ఓసారి చూచిపోదామని వచ్చాడు.' అని భర్తకు చెప్పి లేచి నిల్చుంది శామల.

కోపంతో ముకుందరావు ముఖం కందగడ్డలా అయిపోయి ఆయువకుని ముఖంలోని చురచురా చూచాడు.

ఆతడు నవ్వుకుంటూ లేచి నిల్చుని 'శ్యామలా ! మరి నేను వెళ్ళొస్తా-ఆ-అన్నట్టు నీకోసం సంపంగి పువ్వులు తెచ్చా. ఇదిగో తీసుకో.' అంటూ ఆతడు ఆమె చేతిలో పెట్టడం ; ఆమె అతని అరచేతిలోని తీసుకొని తలలో పెట్టుకోవడం కళ్ళతో చూచేసరికి ముకుందరావు బుర్ర గిర్రున తిరిగిపోయింది. తన ఆనందానంతా ఈ యువకుడు దోచుకుపోయే బందిపోటు దొంగలా కన్పించాడు. అతనియెదుట తన భార్య అప్సరసలావుంది.

శ్యామల నవ్వుతూ ముకుందరావుతో 'కూర్చోండి' అంది.

కాని ముకుందరావు మాత్రం ఆ యువకునివైపు తన భార్య వైపు తీవ్రంగా చూస్తున్నాడు. ఇంత ఘాటుగా చూస్తోన్నా భర్తని లెక్క చెయ్యనట్లుగా వారిద్దరూ ఒకరిపై వొకరు కొంటె చూపులు చూసుకొంటూ చిలిపి నవ్వులు నవ్వుకుంటూంటే ముకుందరావు మనస్సులో ఆకాశం ఎత్తునా అసూయా జ్వాలలు లేచాయి.

'ఏయ్! ఒక పరాయి వ్యక్తితో ఇల్లా వ్యవహరించడం సంసారికి లక్షణమేనా?' అని గర్జించాడు.

'ఎల్లా ప్రవర్తిస్తే మాత్రం నేనెందుకు పనికి వస్తానండీ?' అంది నవ్వుతూనే శ్యామల.

ఆ యువకుడు ముసిముసి నవ్వులతో ముకుందరావు వైపు చూచాడు.

ముకుందరావు ఇంక కోపానికి తట్టుకోలేకపోయాడు. ఉద్రేకంతో ముందుకు వచ్చి 'కులటా ఇన్నాళ్లు నువ్వు

ఆడే నాటకం ఇదా? ఇప్పుడే నిన్నూ నీ కొడుకు దగ్గరకే పంపిస్తానుండు' అంటూ క్షణంలో మూలనున్న కర్ర తెచ్చి భార్యను కొట్టబోయేసరికి, ఆమెకి అడ్డం నిలుచున్న ఆ యువకుని తలమీద తగిలిందా దెబ్బ.

'అయ్యో! అనసూయా!! అంటూ గభీమని పట్టుకుంది శ్యామల. తలపాగామీద తగిలినా బలమైన దెబ్బ కావడంచేత నుదురుమీంచి బొట బొట రక్తం కారుతూంటే చీర కొంగుతో ఒత్తిపట్టుకుంది. అంతలో శ్రీధరం రామయ్యగారు వచ్చారు. ముకుందరావు అల్లాగే శిలా ప్రతిమలాగ నిల్చుండిపోయాడు.

కూతురు తలమీంచి కారే రక్తాన్ని చూచిన రామయ్య కోపంతో కళ్ళల్లోంచి నిప్పులు కురిపిస్తూ 'దౌర్భాగ్యుడా! కట్టుకొన్న ఇల్లాలిని ఆదరించడం చేతకాక, కడుపున్ని పుట్టిన బిడ్డ అంత్య దశలో నీ పాదాల దగ్గరికి వచ్చిన ఇల్లాలిని వేశ్యలు అవమానిస్తూంటే, వాళ్ళకి తాళం వేసిన నువ్వు ఓ మగాడివేనా? సీతాదేవి వంటి ఉత్తమ సాధ్వి కాబట్టే ఇన్నాళ్ళూ ఓర్పుతో సహించింది. ఆమెలోని ఆధిక్యతని నీకు చూపించడావికే నాబిడ్డకి మగ వేషం వేయించాము. ఒక పర పురుషుడు ప్రక్కని వుంటేగాని నీ భార్యలోని స్త్రీత్వాన్ని గుర్తించుకోలేకపోయావు. క్షణకాలం నీ భార్యతో ఓ మగవ్యక్తి మాట్లాడితేనే సహించలేనంత అసూయ నీలో వున్నప్పుడు. అహోరాత్రాదులు నువ్వు పరస్త్రీలోలుడవై వుంటే నీ భార్య ఎంతగా దుఃఖిస్తుందో ఇప్పటికైనా బాగా అర్థమైందా?' అని తీవ్రంగా అడిగాడు.

'ముకుందరావుగారూ! డబ్బు వున్నంతకాలమే నీకు ఆనందాన్నిచ్చి అది లేకపోతే కుక్కకన్నా కనికష్టంగా గెంటిన వేశ్యలోని ప్రియురాలి ప్రేమలో చిక్కుకొని పితృప్రేమను కూడా చెందనాడుకొన్నావు. నీ భార్య ఎవరో నే నెన్నడూ తెల్సుకోలేకపోయినా ఆమెలోని మాతృప్రేమ, నేనూ ఆమెవంటి తల్లికే జన్మించిన వాడను కాబట్టి నా తల్లికి నామీద ఎంత ప్రేమ వుంటుందో; ఈ పేదరాలికి ఆమె బిడ్డమీద అంత ప్రేమ వుంటుందని, తక్షణం ఆవిడతో అర్థరాత్రి సమయమని శంకించక వచ్చాను. నీ భార్య నాకు సోదరివంటిది. సాటి మానవుల్ని మానవులుగా చూడ్డమే నాకు తెల్సు- ఆమె కష్టాలు గట్టెక్కించి నీ కళ్ళు తెరిపించడానికే ఆనాడు నీ జేబులో పర్సు లాక్కున్నా - ఇదుగో నీపర్సు ఇన్నాళ్లూ నీ భార్యని సోదరిగా ఆదరించాను నేను - బిడ్డగా చూచుకొన్నాడు రామయ్యగారు - ఈనాటినుంచైనా బుద్ధిగా ప్రవర్తించు-అటువంటి మహోత్తమ సాధ్వికి భర్త అని చెప్పుకోవడానికి కూడా తగనని ఈనాటికైనా గుర్తించుకో.' అన్నాడు రౌద్రాకారంతో శ్రీధరం.

'సాటిస్త్రీకోసం నా రక్తాన్ని ధారపోసినా ఆమె ఆనందంగా సుఖించగల్గితేచాలు - ఇంకనుంచైనా మా అక్కయ్యను సేవించి మీ జన్మ తరింపజేసుకోండి ముకుందరావుగారూ!' అంది అనసూయ.

అందరి మాటలు వినేసరికి ఒక్కసారిగా తన కళ్ళల్లోని చీకటి తెరతొలగిపోయింది. శ్యామలా! నువ్వు దేవతవి. నీలోని పవిత్రతను అర్థంచేసుకోలేకపోయిన కిరాతకుణ్ణి. నన్ను క్షమించవూ?' అని పశ్చాత్తాపంతో భార్య రెండు చేతులూ పట్టుకొన్నాడు ముకుందరావు. అందరి కళ్ళల్లోనూ ఆనందకాంతి వెలిగిపోతుంది.

శ్రీధరం అనసూయ తలకు కట్టుకట్టి 'అబ్బా! ఎంత దెబ్బ తగిలింది?' అని నొచ్చుకున్నాడు. ఆతని హస్త స్పర్శకి సిగ్గుతో తలవొంచుకుని శ్యామల దగ్గరగా నిల్చుంది.

'రామయ్య మామగారూ! నన్ను క్షమించండి. శ్రీధరంగారూ! మీరు నా యజమాని కొడుకైవుండీ మాయందు చూపిన ఆదరాభిమానానికి కృతజ్ఞుణ్ణి' అని అనసూయవైపుచూచి భిడియంతో 'నాతప్పిదానికి మన్నించండి' అన్నాడు ముకుందరావు. 'ఫరవాలేదు నాయనా! బ్రతుకలో చీకటి వెలుగులు. కొన్నాళ్ళు చీకటి-తర్వాత వెలుగు. మీకు చీకటి రాత్రిళ్ళు గడిచాయి. ఇంకనుంచి చల్లగా సంసారం చేసుకోండి. ఇవ్వాళనుంచే శ్రీధరంగారి కొట్లో మామూలుగా ప్రవేశించు' అన్నాడు రామయ్య ఆనందంతో.

'నాదొక్క కోరిక శ్రీధరంగారూ! మీరు కాదనక నెరవేర్చాలి.' అంది శ్యామల.

'మా అన్నయ్యగారెక్కడికీ వెళ్ళకుండా కాపలా కాయమంటారా?' నవ్వుతూ అడిగాడు.

'కాదు. మాచెల్లి అనసూయని కాపలా కాయండి. అన్ని విధాలా మా శ్రేయస్సుకోరే మీరు అనసూయను భార్యగా స్వీకరించి రామయ్య బాబుగారి భారాన్ని తీర్చమని నా వేడికోలు' అంది శ్యామల.

ఆమాటకోసమే ఎదురుచూస్తూన్న అనసూయ శ్రీధరం సిగ్గుతో తల వొంచుకున్నారు.

శ్యామలా ముకుందరావు, అనసూయ. శ్రీధరం కల్సి రామయ్యగారికి నమస్కరిస్తోంటే, శతసహస్ర దీవెనలిస్తూ ఆనందంతో ఉప్పొంగిపోయాడు ఆ తండ్రి.

(సమాప్తం.)